

# బిందురేఖ

తీపి సుఖంగా ఉంటోంది. కారం నసాళాని కంటుతోంది. చేదుని నాలిక తిరగ్గొడ్తోంది. అన్నీ తెలుస్తూనే ఉన్నాయి. సుఖానికి మనసు పొంగుతోంది. బాధకి శరీరం తల్లడిల్లిపోతోంది. అసూయ, కోపం అన్నీ అర్థమవుతూనే వున్నాయి. కాని స్త్రీ అనే జీవి మాత్రం అగమ్యంగా వుండి అర్థం కావటం లేదు. -- అర్థం అయినట్టుండి కాకపోవటం. చీకటి వెలగటం, అంతుపట్టటం లేదు.

మట్టెల మోతకే గుండెజల్లుమన్న ఆ మనిషే తెంచుకోవలసిన బంధం

అంటున్నాడే!

ఎరఎర్రని పెదవులు, తెల్ల పారిజాతాల కళ్ళల్లో తుమ్మెద కనుపాపలు, చీకటంత జడల్లో చందమామ ముఖాలు, సుగంధం కమ్మినట్లు నవ్వులతెరలు, కౌగలించుకునే హస్తాలు, హత్తుకునే వక్షాలు, ఐక్యమయ్యే శరీరాలు ఈ మూర్తిని, ఈ రూపుని చింపి ముక్కలు చేద్దామా? నెత్తిన పెట్టుకు పూజిద్దామా?

పూజించారు పూర్వాన. ఆరాధించారు అమరావతిగడ్డన ఒకటో శతాబ్దినాడే. కథలు కథలుగా ఆ మూర్తిని స్మరించుకున్నారు.

అల్ల, ఆ పడుచుకి ఎడమకన్ను అదిరింది. అది శుభసూచకం. దూరానెక్కడో ఉన్న ప్రియుడు తప్పక తిరిగివస్తాడు అనుకుంది. ప్రియుడి ఆలోచన రాగానే వొళ్ళు పులకలెత్తింది. కృతజ్ఞతగా ఎడమ కన్నుతో అంది ఆమె. 'ఓసీ ఎడమకన్నా! నీ సూచన ప్రకారం నావాడు తిరిగొచ్చెనో కుడికన్ను సాంతం మూసేసి నీ తోటే నా ప్రియుణ్ణి తనివితీరా చూసుకుంటాను" అని.

ఎర్రకోకలు కట్టుకున్న పడుచులు విసవిస నడిచి వెళ్తున్నారు. నీలిరంగు కంచులిక స్థనభారాన్ని ఆపలేకపోతోంది. వంగి నీళ్ల ముంచుకుంటున్న వారిని కొంటెగా చూస్తున్నారు కొందరు కుర్రకారు. ఆ చూపులకి సిగ్గుతో తత్తరైపోగా ఆ తడబాటుకి గాజులు కదిలిపోతున్నాయి.

పొలాన అరక దున్నుతున్నాడు అతగాడు. పొద్దు నడినెత్తి కొస్తోంది. పడుచుపెళ్ళాం బువ్వట్టుకు రాలేదు. అరక చాలులోనే సాగుతున్నా కళ్ళు డొంకవైపుకే ఉన్నాయి. దూరాన ఎక్కడో ఖంగుఖంగుని కడియాల చప్పుళ్ళు. అరక ఆపి చూశాడు. తన భార్యే! పాలపిట్ట ఒక రాయి మీంచి ఇంకో రాయి మీదికి గెంతినట్టు చెంగనాలు పెడ్తూ వస్తోంది. ముక్కు బులాకీ ఎండకి తళుక్కుమంటోంది. దవు దవ్వులకు వచ్చే భార్యని చూసి పట్టరాని సంతోషంతో ఎద్దుల మెడపట్టీలు విప్పబోయి ముకుదాళ్ళు విప్పేశాడు.ఇంక పొగరు ఎవరు ఆకట్టగలరు?

సంజెవేళ అయేసరికి జడల్లో ముడుచుకోడానికి అందరికీ దాసాని పూలు కావాలి.

ఆ పూలు వూరిబయటతోపుల్లోనే దొరుకుతాయి. అవి కోసుకురావడానికి మొగవారినంపితే వారు ఏ ఆడవారికి చిక్కిపోతారోనని మరుదులను కలవారి లోగిళ్ళకి పంపి పూలు తెప్పించేవారు.

ఎటు చూసినా పువ్వులు, పువ్వుల్లాంటి స్త్రీలు. స్త్రీల ఆకారమే కాదు, మనసెరిగిన మనుషులు.

అదుగో! కింశుక వృక్షం కింద వొత్తుగా రాలిన పూలు. ఆకుపచ్చ ఆకులతో పసుపుపచ్చ పూలవాన. బుద్ధభగవానుని పాదాలచుట్టూ సాష్టాంగపడ్డ వేలాది భిక్షువుల్లా వున్నాయి ఆ రాలిన పూలు.

పోనీ ఆ భిక్షువుల దగ్గరకే వెళ్దాం.

ఓ సన్యసించిన స్వామీ! జీవితంలో అన్నీ వొదులుకుని, కోరికలు చంపుకుని ధర్మదీక్షతో ఉన్న నువ్వు-నువ్వెలా చెక్కావయ్యా అపురూప స్త్రీ సౌందర్యాన్ని? ఇంతటి మహత్తర జీవరహస్యాన్ని సర్వసంగ పరిత్యాగివి నీవెలా గ్రహించావయ్యా? మానసికంగా సన్యాసివయి ఇంతటి రససముద్రాన్ని ఎలా ఆవిష్కరించావయ్యా?

కళ్ళముందు కన్పించేది మిధ్య అనుకోవటమా? అనుభవించింది అసత్యం అనుకోవటమా?

తల్లికడుపున పుట్టి, ఆ తల్లి వొళ్ళో పెరిగి, వయసొచ్చాక కన్నెపిల్ల కోసం కలలుగని.ఆ పొందుకోసం ఏడ్చి ఏడ్చి, పొందులోనే ప్రపంచం ఉందని భావించి, పలవరించి తనకు సంతానాన్ని కనిస్తే మురిసిపోయి వయసు పై బడగానే ఆ ప్రాణాధారమైన జీవి మాయబంధమై పోతుందా?

ఆకారాల గురించి ఆకాశమంత వర్ణనలు చేశారేగాని ఆ మనసులోని అగాధ పాతాళం నుంచి అమూల్య రత్నాలు వెలికి తీయరేమి?

ఏనాటికి బోధపడుతుంది ఆ జీవి?

బిందువు రేఖగా సాగిపోతోంది. కాని ఆ బిందువు స్వరూపం తెలియటం లేదు.⁂